అసౌకర్యాల సంత.. ప్రజల చింత

- రోడ్లపైనే కొనసాగుతున్న వైనం
- మౌలిక వసతులు అంతంతే..
- ఆదాయం వస్తున్నా పట్టింపు కరువు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


ఇరుకు స్థలంలో కొనసాగుతున్న కౌటాల వారసంత

కౌటాల: పంచాయతీలకు ఆదాయ వనరులుగా నిలుస్తున్న వారసంతల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చాలా చోట్ల ప్రత్యేక స్థలాలు, షెడ్లు లేక రోడ్లకు ఇరువైపులా తాత్కాలిక డేరాలు వేసుకొని దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. వ్యాపారుల నుంచి పన్నులు వసూలు చేస్తున్నా కనీసం తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు వంటి సౌకర్యాలు కూడా కల్పించడం లేదు. రోడ్లకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేస్తుండడంతో సంత రోజు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. జిల్లాలోని బెజ్జూర్, దహెగాం, వాంకిడి, కౌటాల, జైనూర్, సిర్పూర్(టి), కెరమెరి, రవీంద్రనగర్‌లలో వారసంతలు నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల తాగునీటి కోసం చేతిపంపులు ఉండగా, మరి కొన్నిచోట్ల అవి కూడా లేవు. విక్రయాలు జరపడానికి షెడ్లు లేకపోవడంతో టార్పాలిన్లు కట్టుకొని అమ్మకాలు చేపడుతున్నారు.

సరిపోని స్థలాలు..

సంత నిర్వహణకు స్థలం లేకపోవడంతో రోడ్లకు ఇరువైపుల వ్యాపారాలు కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల సంత కోసం ఉన్న ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. జిల్లాలోని వార సంతలతో ఏటా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది. మండల కేంద్రంలో జరిగే వారసంతతో జీపీకి ఏటా రూ. 5 లక్షలపైనే ఆదాయం వస్తోంది. ఇక్కడ సంత కోసం 5 ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించారు. కానీ అధికారుల పర్యవేక్షణ లేక సుమారు రెండు ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైంది. దీంతో స్థలం సరిపోక కొందరు వ్యాపారులు రోడ్ల పక్కన, దుకాణాల ఎదుట క్రయవిక్రయాలు జరుపుతున్నారు. కొందరు దుకాణ యజమానులు వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. మరోవైపు సంతను దక్కించుకున్న గుత్తేదారు కూడా వ్యాపారుల నుంచి రూ. 30 నుంచి రూ. 50 వరకు రుసుం వసూలు చేస్తున్నారు. కానీ సదుపాయాలు మాత్రం కల్పించడం లేదని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సౌకర్యాలు కరువు..

సంతల్లో కూరగాయలు, ఇతర వస్తువులు విక్రయించే వారి నుంచి సంబంధిత పంచాయతీ సిబ్బంది సంత నిర్వహణ కోసం డబ్బులు వసూలు చేస్తున్నారు. కానీ సంతల్లో సౌకర్యాలు కల్పించడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. వానాకాలంలో బురదమయంగా మారి సంతలో అడుగుపెట్టే పరిస్థితి ఉండదు. మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళా వ్యాపారులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. వారాంతపు సంతలు జరిగే గ్రామాల్లో ఉపాధిహామీ పథకం నిధులు వినియోగించుకోవచ్చు. కానీ దీనిపై పాలకవర్గాలకు పూర్తిస్థాయి అవగాహన లేకపోవడంతో పనులు చేపట్టలేదు. కనీసం ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు వారసంతల స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చూడడంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలని వినియోగదారులు కోరుతున్నారు.

రోడ్డుపైనే అమ్ముతున్నారు



ప్రస్తుత వార సంతకు స్థలం సరిపోవడం లేదు. దీంతో చిరు వ్యాపారులు రోడ్డుపైనే దుకాణాలు ఏర్పాటు చేసుకొని సరుకులు అమ్ముతున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. వారసంతతో ఏటా జీపీకి ఆదాయం వస్తుంది. అధికారులు స్పందించి పరిష్కారం చూపాలి. - లక్ష్మి, యాపలగూడ

సౌకర్యాలు కల్పిస్తాం



కౌటాల వారసంతలో మరుగుదొడ్లు నిర్మించడానికి అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే మరుగుదొడ్లు నిర్మిస్తాం. వారసంతలో వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం. -ఎస్.సాయికృష్ణ, పంచాయతీ కార్యదర్శి

దారి లేని 'బొప్పరం'

- వర్షాకాలంలో ఒర్రె దాటాల్సిన దుస్థితి
- వంతెన నిర్మించాలని వేడుకోలు


అధ్వానంగా బొప్పరం రోడ్డు

దహెగాం: ఆదివాసీ గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటున్నాయి. సరైన మౌలిక వసతులు లేకపోవడంతో గిరిజనులు అనేక అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రానికి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బొప్పురం గ్రామానికి వెళ్లాలంటే కనీసం దారి సౌకర్యం కూడా లేకపోవడంతో గ్రామస్తుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. పార్వతిపేట, బొప్పురం మధ్యలో ఉన్న ఒర్రె గుండా ద్విచక్ర వాహనాలు, ఆటోలు కూడా వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయి.

గ్రామంలో 20 కుటుంబాలు..

గిరిజన గ్రామం బొప్పురం మండల కేంద్రానికి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. గ్రామంలో సుమారు 20 కుటుంబాలు ఉండగా, 100 మంది నివసిస్తున్నారు. గ్రామంలో పాఠశాల లేకపోవడంతో విద్యార్థులు సమీపంలోని పార్వతిపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు వెళ్తున్నారు. గ్రామస్తులు ఏ అవసరం ఉన్నా పార్వతిపేట మీదుగా మండల కేంద్రానికి వెళ్లాలి. బొప్పురం, పార్వతిపేట మధ్యలో ఒర్రె ఉంది. వర్షాకాలంలో ఒర్రె దాటలేని పరిస్థితులు ఉంటున్నాయి. ప్రస్తుతం ఒర్రెలో వరద నీరు లేదు. కానీ విపరీతంగా ఇసుక ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని సుమారు 15 మంది పిల్లలు పార్వతిపేట పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. వర్షాకాలంలో విద్యార్థులను తల్లిదండ్రులు వచ్చి ఒర్రె దాటించి పాఠశాలకు పంపించాల్సిన పరిస్థితి ఉంది.

ఒర్రెపై వంతెన నిర్మించాలి..

బొప్పురం, పార్వతిపేట మధ్యలో ఉన్న ఒర్రెపై వంతెన లేక పోవడంతో గ్రామస్తులు తిప్పలు పడుతున్నారు. వర్షాకాలంలో పొలాలు, చేను మార్గాన రాకపోకలు సాగిస్తుంటారు. ఒర్రె పక్కనే ఉన్న పొలానికి కట్ట ఉండడంతో కట్టపై నుంచే రాకపోకలు సాగించాల్సి వస్తుందని వాపోతున్నారు. వర్షాకాలంలో గ్రామానికి కనీసం ద్విచక్ర వాహనం సైతం వెళ్లలేని పరిస్థితి ఉంటుందని ఆవేదన చెందుతున్నారు. ఒర్రెపై కల్వర్టు లేదా రోడ్ డ్యాం నిర్మించాలని, గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మా ఊరికి రోడ్డు వేయాలి



నేను చిన్నప్పటి నుంచి చూస్తున్నా. అప్పుడు ఎట్ల ఉన్నదో మా ఊరు ఇప్పుడు గట్లనే ఉన్నది. రోడ్డు కూడా సక్కగ లేదు. ఏ పని ఉన్నా, రేషన్ బియ్యం తెచ్చుకోవాలన్నా దహెగాం పోవాలి. వర్షాకాలంలో మాకు చానా ఇబ్బందవుతుంది. ఇప్పుడు కూడా మా ఊరికి బండ్లు రావు. మా ఊరికి రోడ్డు వేయాలి. - మేకల బూదక్క, బొప్పరం

ఒర్రెపై వంతెన కట్టాలి



ఏళ్ల సంది ఇదే గోస మాకు. ఇప్పటికీ సక్కగా రోడ్డు లేదు. ఏటు పోవాలన్నా మాకు గోస ఉంది. చేల దారిలో దహెగాంకు పోతున్నాం. ఓట్లప్పుడు మాత్రం ఎవరెవరో లీడర్లు వస్తరు. అది చేస్తం, ఇది చేస్తం అని చెప్పుడే కానీ చేసేది ఏమి లేదు. ఒర్రెపై వంతెన కట్టాలి. పెద్ద సార్లు మా ఆదివాసీలపై దయ చూపాలి. - ఆశన్న, బొప్పరం

పారిశుధ్యం లోపించకుండా చర్యలు

- ప్రారంభమైన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం


దహెగాం: పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజేశ్వర్ గౌడ్

దహెగాం: ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయని ఎంపీడీవో రాజేశ్వర్ గౌడ్ అన్నారు. బుధవారం మండలంలో ఐనం, కల్వాడ గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. పారిశుధ్యం లోపించకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

ఆసిఫాబాద్: గ్రామాల్లో ఇంటి పరసరాలతో పాటు కాలనీల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిర్పూర్(టి) మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌పీవో సురేశ్‌బాబు అన్నారు. బుధవారం సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధిలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని పలు వీధుల గుండా ర్యాలీ నిర్వహించి మురికి కాలువల పూడికలు తీయించారు. మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, ఈవో కృష్ణమూర్తి, మాజీ ఉపసర్పంచ్ తోట మహేష్, నాయకులు ఇఫాత్‌హుస్సేన్, ఏఎస్‌ఎంలు పాల్గొన్నారు.

కెరమెరి: ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో బుధవారం స్వచ్ఛతా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో ఉన్న అంతర్గత రోడ్లను చీపుర్లతో శుభ్రం చేశారు. మురికి నాలీల్లో ఉన్న మురికి నీరు తొలగించారు. ఝరి, మోడి గ్రామపంచాయతీల్లో ఎంపీపీ పెందోర్ మోతీరాం, జెడ్పీటీసీ దుర్పత బాయి, ఎంపీడీవో మహేందర్ పాల్గొన్నారు.


కెరమెరి: మోడిలో..


కౌటాల: పనులు ప్రారంభిస్తున్న ప్రత్యేకాధికారి

పెంచికల్‌పేట్: ప్లాస్టిక్ నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని ఎంపీవో గంగాసింగ్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వస్తువుల వినియోగం, నివారణలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: మండలంలోని గ్రామ పంచాయతీలలో పకడ్బందీగా పారిశుధ్యం పనులు నిర్వహించాలని డీఆర్‌డీవో, మండల ప్రత్యేకాధికారి సురేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రత్యేక పారిశుధ్యం పనులను ఆయన ప్రారంభించారు. ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, ఎంపీడీవో నజ్బుల్లా ఖాన్, తదితరులు పాల్గొన్నారు.


పెంచికల్‌పేట్: పోస్టర్ విడుదల చేస్తున్న అధికారులు

ఘనంగా రమాబాయి అంబేద్కర్ జయంతి

ఆసిఫాబాద్‌అర్బన్: రమాబాయి అంబేద్కర్ 126వ జయంతిని బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద జైభీం సేన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సేన అధ్యక్షుడు అశోక్, సుధాకర్, చరణ్‌దాస్, పెంటయ్య, సాంబయ్య, అజిత్, అనిల్ దుర్గె తదితరులు పాల్గొన్నారు.


ఆసిఫాబాద్‌అర్బన్: నివాళులర్పిస్తున్న నాయకులు

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా గ్రామంలో బుధవారం మాతా రమాబాయి అంబేద్కర్ 126వ జయంతిని ఘనంగా నిర్వహించారు. జైభీం యూత్ ఆధ్వర్యంలో రమాబాయి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించి స్థానిక పాఠశాలలో స్వీట్లు పంపిణీ చేశారు. జైభీం యూత్ అధ్యక్షుడు దుర్గం దుర్యోధన్, నాయకులు జుమ్మిడి పోశ్చు, న్యాయవాది దుర్గం విజయ్ కుమార్, నాయకులు ప్రకాశ్, నక్క జనార్దన్, బరిగెల శంకర్, బండ శేఖర్, తిరుపతి, మున్వర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: మహనీయుల అడుగుజాడల్లో నడవాలని అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు కాంబ్లే అన్నారావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రమాబాయి అంబేద్కర్ సమాజానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో సతీశ్ గైక్వాడ్, దళిత సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.

'ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం'

రెబ్బెన: బీఆర్‌ఎస్‌లో క్రియాశీల పాత్ర పోషిస్తూ విలేకరి ముసుగులో ఓ నాయకుడు విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్, మాజీ సర్పంచ్ గంటుమేరలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. గంగాపూర్ శివారులోని 342/1లో గల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మండలంలోని వర్కింగ్ జర్నలిస్టుల తాత్కాలిక ప్రెస్‌క్లబ్ భవనం కోసం గతంలో జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేకు ప్రభుత్వ భవనాన్ని కేటాయించగా భవనం పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని కబ్జా చేసేందుకు సదరు బీఆర్‌ఎస్ నాయకుడు కుట్ర చేశాడన్నారు. గతంలో రెబ్బెనలో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పని చేసిన అధికారి అడ్డగోలుగా డబ్బులు దండుకుంటూ ప్రభుత్వ స్థలాన్ని ఇళ్ల స్థలాల కోసం మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై కలెక్టర్‌కు త్వరలో ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాజీ, వంకులం మాజీ సర్పంచ్ ప్రేందాస్, చల్లూరి గంగయ్య, సంతోష్, తిరపతిగౌడ్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల మంజూరు చేయాలని వినతి

లింగాపూర్: మండలానికి నూతనంగా బాలుర ఉన్నత ఆశ్రమ పాఠశాల మంజూరు చేయాలని గిరిజన నాయకులు జాదవ్ రాజశేఖర్, జాదవ్ రామారావ్, ఆడే రవీందర్ బుధవారం ఐటీడీఏ కార్యాలయాన్ని సందర్శించి ప్రాజెక్ట్ అధికారి ఖుష్బుగుప్తాకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని గిరిజన జనాభాను అనుసరించి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు. మండలంలో ఆశ్రమ పాఠశాల లేకపోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని తెలిపారు. ఆశ్రమ పాఠశాల మంజూరు పీవో సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.


వినతిపత్రం అందజేస్తున్న గిరిజన నాయకులు

పంచాయతీ ప్రత్యేక అధికారికి సన్మానం

బెజ్జూర్: బెజ్జూర్ గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా నియమితులైన వెంకటేశంను ఎంపీటీసీ పర్వీన్ సుల్తా జావిద్ ఘనంగా సన్మానించారు. బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆయనను శాలువతో సత్కరించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్ ఆధ్వర్యంలో సైతం అధికారిని సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి మీసారి వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన కోసం పాదయాత్ర

దహెగాం: పేదరిక నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న గడపగడపకు పాదయాత్ర పోస్టర్లను బుధవారం పేదరిక నిర్మూలన పోరాట సమితీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రగిరి సుదర్శన్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గత నెల 25న ప్రారంభమైన పాదయాత్ర ఏప్రిల్ 25న సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందించడంతో ముగుస్తుందన్నారు. పేదరిక నిర్మూలనలో భాగంగా మహాత్మగాంధీ ఉపాధిహామీ పథకం కింద 335 రోజులు పని దినాలు కల్పించాలని, కేజీ టు పీజీ వరకు నాణ్యమైన విద్య అందించాలని పేర్కొన్నారు. సంఘం నాయకులు నక్క శ్రీనివాస్, చంద్రగిరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సుదర్శన్

బాలికల భద్రతే షీ టీమ్స్ లక్ష్యం

వాంకిడి: బాలికల భద్రతే లక్ష్యంగా షీ టీమ్స్ పని చేస్తున్నాయని సీఐ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని మోడల్ డిగ్రీ కళాశాలలో షీటీమ్స్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆకతాయిలు భయందోళనకు గురి చేసినా, వేధించినా, ఇబ్బందికరంగా మాట్లాడినా వెంటనే డయల్ 100కు లేదా 8712670564 నంబర్లకు సమాచారం అందించాలన్నారు. బాలికలను వేధింపులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కనకయ్య, షీ టీమ్ ఇన్‌చార్జి సునీత, శ్రీలత పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ముగిసిన కబడ్డీ పోటీలు

కెరమెరి: మండలంలోని ఇందాపూర్, సావర్‌ఖెడా గ్రామాల మధ్య పోతురాజు, ధర్మరాజు ఉత్సవాల సందర్భంగా ప్రారంభమైన కబడ్డీ పోటీలు బుధవారం ముగిశాయి. 34 టీంలు పాల్గొనగా కొలాం కొఠారికి చెందిన టీం విజేతగా నిలిచింది. దీనికి వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం రూ.7777 ప్రథమ బహుమతి అందించగా.. ద్వితీయ స్థానంలో కెరమెరి జట్టు నిలిచింది. ఆలయ కమిటీ తరఫున రెండో బహుమతి రూ.5555లను అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు సిడాం రాజు, ధర్మూ, నాయకులు భీంరావు, రాజు తదితరులు ఉన్నారు.

చింతగూడలో మద్యపానం నిషేధించాలి

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని చింతగూడలో మద్యపానం నిషేధించాలని గ్రామస్తుడు జాడి దీపక్ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ కిరణ్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ స్థానికంగా మద్యాన్ని కల్తీ చేసి విక్రయిస్తున్నారని, దీంతో మద్యం సేవించే వారు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. అధికారులు స్పందించి మద్యం విక్రయాలను, కల్తీ మద్యాన్ని అరికట్టాలని కోరారు.

సమ్మక్క జాతరకు ఏర్పాట్లు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ సమీపంలోని పెద్ద వాగు వద్ద సమ్మక్క సారక్క జాతరకు నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 21న జాతరను నిర్వహిస్తున్నట్లు జాతరకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. దేవతల గద్దెలకు రంగులు వేయడంతో పాటు అలంకరణ పనులు పూర్తవుతుండగా దుకాణాలు ఏర్పాటు చేసుకునే వ్యాపారులకు ప్రత్యేకంగా స్థలాన్ని గుర్తించారు. కాగా ఏర్పాట్లు జరుగుతుండగానే దేవతలకు భక్తులు మొక్కులు తీర్చుకుంటున్నారు. జాతర కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేశ్ మాట్లాడుతూ భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సడక్‌గూడలో వైద్యశిబిరం

వాంకిడి: మండలంలోని సడక్‌గూడ గ్రామంలో బుధవారం పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా ఆర్బీఎస్కే ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కొలాం గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు, వైద్య సిబ్బంది సబీర బేగం, రాజువర్ధన్, మాజీ సర్పంచ్ సీడం అన్నిగా తదితరులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

'తెలుగు భాష మాట్లాడించాలి'


రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో సుధాకర్

కెరమెరి: పాఠశాలలోని విద్యార్థులంతా మరాఠి మాతృభాషకు చెందిన వారు కావడంతో తెలుగు భాష మాట్లాడేందుకు చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారి కుడ్మెత సుధాకర్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని కోటా, పరంధోళి పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. విద్యార్థులను చదివించారు. బోర్డు పై రాయించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని పేర్కొన్నారు.

ఆరె సంక్షేమ సంఘం కమిటీ

దహెగాం: మండల కేంద్రంలో బుధవారం ఆరె సంక్షేమ సంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. దహెగాం ఆరె సంక్షేమ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా చప్పిడి తిరుపతి, గౌరవ అధ్యక్షుడిగా పాలె ఊషన్న, ప్రధాన కార్యదర్శిగా బుడిపెలి ప్రకాశ్, ఉపాధ్యక్షులుగా సామెర మల్లేష్, ఎల్కరి ప్రశాంత్, కోశాధికారిగా తుమ్మిడె సత్యనారాయణ, ప్రచార కార్యదర్శులుగా తుమ్మిడె సురేశ్, ఎల్కరి శ్రీనివాస్, కార్యదర్శులుగా ఎల్కరి తిరుపతి, పుల్లూరి శంకర్‌లతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆరె సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు పుల్గం నారాయణ, బక్కయ్య, తుమ్మిడె నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన సీఐగా చిట్టిబాబు బాధ్యతల స్వీకరణ


చిట్టిబాబుకు స్వాగతం పలుకుతున్న ఎస్సై చంద్రశేఖర్

రెబ్బెన: నూతన సీఐగా చిట్టిబాబు బుధవారం మండల కేంద్రంలోని తమ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. రెబ్బెన సీఐగా పని చేసిన అల్లం నరేందర్‌ను బదిలీ కాగా ఆయన స్థానంలో ఖమ్మం సీఎస్‌బీ-1లో విధులు నిర్వహిస్తున్న చిట్టిబాబును ఇక్కడికి వచ్చారు. బుధవారం బాధ్యతలు చేపట్టిన ఆయనకు రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్, తిర్యాణి ఎస్సై సీహెచ్ రమేశ్‌లు మొక్క అందజేసి స్వాగతం పలికారు.

ఆసిఫాబాద్ సీఐగా సతీశ్

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ సీఐగా గడిగొప్పుల సతీశ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. మల్టీజోనల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సతీశ్‌ను జిల్లా కేంద్రానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కేంద్ర మంత్రిని కలిసిన ఎమ్మెల్యే హరీశ్‌బాబు


నితిన్ గడ్కరీతో బీజేపీ ఎమ్మెల్యేలు

కాగజ్‌నగర్‌రూరల్: కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు కలిశారు. బుధవారం న్యూఢిల్లీలో బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, ఏలేటి మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్‌లతో కేంద్ర మంత్రిని ఆయన నివాసంలో కలిశారు. హైదరాబాద్ నుంచి రాయ్‌పూర్ కారిడార్‌లో బెల్లంపల్లి నుంచి గడ్చిరోలి వరకు నాలుగులైన్ల జాతీయ రహదారిని మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

'సఖీ' సేవలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సఖీ బృందం సభ్యులు

దహెగాం: మండలంలోని పీపీరావు కాలనీ, కుంచవెల్లి, కల్వాడ, పెసరికుంట గ్రామాల్లోని మహిళలకు సఖీ అందించే సేవలపై బుధవారం అవగాహన కల్పించారు. సిబ్బంది మాట్లాడుతూ గ్రామాల్లోని మహిళలు గృహహింస, వరకట్న వేధింపులు, బాల్యవివాహాలు, లైంగిక వేధింపులు, అక్రమ రవాణా వంటి ఇబ్బందులు ఎదుర్కొంటే మహిళా హెల్ప్‌లైన్ 181కు ఫోన్ చేయాలని సూచించారు. సఖీ ఆధ్వర్యంలో అందించే వైద్య సేవలు, కౌన్సిలింగ్ సేవలు, పోలీసుల సహాయం, న్యాయ సహాయం, తాత్కాలిక వసతులపై వివరించారు. సఖీ సిబ్బంది పవిత్ర, సత్యశీల, రఘు, వినయ్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎస్‌ఎంలు పాల్గొన్నారు.